క్లుప్తంగా

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడకల్చరల్: స్వరాంజలి సంగీత, సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన స్వరహేల కార్యక్రమం ఆద్యంతం మధురంగా సాగింది. వ్యవస్థాపక సభ్యురాలు వడ్డాది కామేశ్వరి ఆధ్వర్యంలో గాయనీమణులు గోళ్ల విజయశ్రీ గుప్తా, ఆకుల నూకరత్నం, మండవ లక్ష్మీదాస్, సీతంరాజు మాధవి, మల్లాది శిరీష, గొర్తి లలిత, కొత్త రమణి భక్తిగీతాలు, లలిత గీతాలతో పాటు పలు తెలుగు హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. కామేశ్వరి మాట్లాడుతూ.. నగరంలో మహిళలే నిర్వాహకులుగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వివిధ రంగాల్లోని మహిళలు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

కాలేయ వ్యాధిపై అవగాహన అవసరం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): కాలేయ సంబంధిత వ్యాధులు, వాటి నివారణ, చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఎస్.భవనారాయణ సూచించారు. ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రైల్వే హాస్పిటల్ న్యూ ఓపీడీ భవనంలో కాలేయ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ భవనారాయణ మాట్లాడుతూ.. అవగాహన లోపంతో చాలామంది కాలేయ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. మానవ శరీరంలో కాలేయం ముఖ్యమైన అవయవమని, క్రమం తప్పకుండా వ్యాయామం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కాలేయ సంబంధిత రుగ్మతల నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. అనంతరం నాగార్జున హాస్పిటల్, జైడూస్ లైఫ్ సైన్సెస్ సహకారంతో రైల్వే ఉద్యోగులు, లబ్ధిదారులకు ఉచితంగా హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, ఫైబ్రోస్కాన్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వే హాస్పిటల్ ఏసీఎంఎస్ డాక్టర్ ఎం.జైదీప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై ఈవో తనిఖీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలోని పవిత్ర సారె, ప్రసాదం కౌంటర్లను ఈవో కేఎస్ రామరావు శుక్రవారం తనిఖీ చేశారు. ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్‌లోని పవిత్ర సారె కౌంటర్‌కు చేరుకున్న ఈవో కౌంటర్‌లోని కొబ్బరి కాయలు, పూజా సామగ్రి, చీరల రికార్డును పరిశీలించారు. పవిత్ర సారె సామగ్రి రోజుకు ఎంత మేర అమ్ముడవుతుందనే వివరాలను అడిగి తెలుసుకోవడమే కాకుండా రికార్డులలోని వివరాలతో సరిచూశారు. ఇక మహా మండపం లిఫ్టు ద్వారా కొండపైకి చేరుస్తున్న లడ్డూ రికార్డును ఈవో తనిఖీ చేశారు. లడ్డూ స్టాక్ ఏ కౌంటర్‌కు చేరుస్తున్నారు..కౌంటర్ రికార్డులను పరిశీలించారు. కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. మహా మండపంలోని క్యూలైన్ కాంప్లెక్స్‌లో దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈవో వెంట ఏఈవో ఎస్.రమేష్‌బాబు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీతారామపురం సబ్ స్టేషన్ 11 కేవీ సూర్యారావుపేట ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం శనివారం ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ టౌన్ డివిజన్ ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గా అగ్రహారం కాలువగట్టు, సీతారామపురం వీఎంసీ డ్రైయినేజీ, కొత్త వంతెన రోడ్, జనతా ప్రెస్ రోడ్, కాట్రగడ్డ వారి వీధి, అంకమ్మ తల్లి టెంపుల్ ఏరియా, దాసరి వారి వీధి, సూర్యనారాయణ వీధి, జడగం వారి వీధి, వేమూరి వారి వీధి, ఏలూరు రోడ్డు ఆంజనేయ స్వామి టెంపుల్ ఏరియా, డోర్నకల్ రోడ్ వీదిరాజు మేడ ఏరియా, గోపరాజు రామచంద్రరావు రోడ్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ముత్యాలంపాడు పరిధిలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ 11 కె.వి. లోటస్, కేదారేశ్వరపేట ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి.సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోటస్ సెక్టార్ -1, 3, లోటస్ మెయిన్ రోడ్డు, కేదారేశ్వరపేట జీరో లైన్, ఒకటో లైన్ నుంచి ఐదో లైను వరకు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

'సెంట్రల్'లో హోరాహోరీగా ప్రచారం

- దూసుకుపోతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- సంక్షేమ పథకాలే ప్రచారాస్త్రాలు
- ప్రజల నుంచి అనూహ్య స్పందన



వృద్ధురాలి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ(ఫైల్)

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన ఘట్టం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికలకు కేవలం మూడు వారాలే సమయం ఉంది. షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచే ప్రచారం ప్రారంభించిన అభ్యర్థులు నామినేషన్ల దశ చేరే సరికే ప్రచారంలో వేగం పెంచారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ తరఫున పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పోటీ చేస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న వెలంపల్లిని పార్టీ అధిష్టానం విజయవాడ సెంట్రల్ అభ్యర్థిగా పంపింది. జనవరి 22న సెంట్రల్ నియోజకవర్గంలో తొలిసారిగా ఆయన పర్యటన ప్రారంభించారు. అప్పటి నుంచి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. అన్న, అక్క, చెల్లి అంటూ ఆప్యాయంగా పలుకరిస్తూ ముందుకు సాగుతున్నారు. దివ్యాంగులతో కలిసి కూర్చుని వారి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. ప్రతి ఒక్కరిని కలిసి 58 నెలల వైఎస్సార్ సీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ ప్రచారం చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్నే ప్రచారాస్త్రాలుగా మలుచుకుని దూసుకుపోతున్నారు. ఇప్పటికే వివిధ కుల సంఘాలతో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధిలోని 21 డివిజన్లను చుట్టి వచ్చారు.

ఫ్యామిలీ అంతా ప్రజలతో మమేకం

సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు ఫ్యామిలీ అంతా ప్రజలతో మమేకమవుతూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. వెలంపల్లి భార్య శ్రీవాణి, కుమార్తె సాయి అశ్విత, అల్లుడు చక్రవర్తి, సోదరులు రాఘవ నరసింహారావు, రామకృష్ణ డివిజన్ల వారీగా వెలంపల్లి తరఫున ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు చూపుతున్నారు. ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి తీరును ప్రజలకు వివరిస్తూ ఎండగడుతున్నారు.

బస్సు యాత్రతో మరింత జోష్

మేమంతా సిద్ధం పేరుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బస్సు యాత్ర చేపట్టారు. ఈనెల 13న బస్సు యాత్ర విజయవాడ నగరానికి చేరుకుంది. యాత్ర విజయవాడ సెంట్రల్‌నియోజకవర్గంలోనే అత్యధిక భాగం సాగింది. చుట్టగుంట సెంటర్ నుంచి రోశాలపాలెం వంతెన, ఘంటసాల సంగీత కళాశాల, ఫుడ్ జంక్షన్, భగత్‌సింగ్ రోడ్డు, ముత్యాలంపాడు గవర్నమెంట్ ప్రెస్, బుడమేరు వంతెన, అజిత్ సింగ్‌నగర్ ఫ్లై ఓవర్, డాబా కొట్లు సెంటర్, కృష్ణా హోటల్ సెంటర్, పైపుల రోడ్డు, ప్రకాష్ నగర్, పాయకాపురం, కండ్రిక జంక్షన్ వరకు నియోజకవర్గంలో సాగింది. యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. నగరంలో ఇప్పటి వరకు జరిగిన యాత్రల్లో ఇంత పెద్ద ఎత్తున ప్రజలు స్వచ్ఛందంగా తరలి రావడం ఇదే ప్రథమం. సీఎం వైఎస్ జగన్ చేపట్టిన ఈ యాత్రతో పార్టీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. యాత్ర పార్టీకి కొత్త ఊపు తెచ్చిందని తటస్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, డెప్యూటీ మేయర్ సైతం...

ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్లు ఏకతాటిపైకి వచ్చి వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నారు. బస్సు యాత్రలో జరిగిన దాడిలో గాయపడిన వెలంపల్లి శ్రీనివాసరావుకు స్వల్ప విశ్రాంతి అవసరం కావడంతో ఆ బాధ్యతలను ఎమ్మెల్యే మల్లాది విష్ణు నెత్తికెత్తుకున్నారు. నియోజకవర్గంలో కీలక ప్రాంతాల్లో ఎమ్మెల్యే విష్ణు ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే తిరిగి వైఎస్సార్ సీపీకే పట్టం కట్టాలని ప్రచారం సాగిస్తున్నారు. వైఎస్సార్ సీపీ నేతల ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- సత్యనారాయణపురంలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



సత్యనారాయణపురంలో వెలంపల్లి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో పేదలకు అండగా ఉండే జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందాయని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ 33వ డివిజన్ సత్యనారాయణపురంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తి, వెలంపల్లి సోదరుడు రాఘవతో కలసి విష్ణు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి రాబోతుందన్నారు. అన్ని వర్గాల వారి జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప వ్యక్తి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ప్రజలకు ఏం మేలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సత్యనారాయణపురం అభివృద్ధిపై చక్కని ప్రణాళికతో ముందుకు వెళ్లామని ఎమ్మెల్యే విష్ణు తెలిపారు. ఈ ప్రాంతంలోని 13 వీధులలో నిర్మించిన నూతన రహదారులతో ఈ ప్రాంత ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. రూ.2.50 కోట్లతో యూజీడీ సంపు నిర్మించామని చెప్పారు. నాడు–నేడులో భాగంగా ఏకేటీపీ స్కూల్‌లో రూ.2.62 కోట్లు, ప్రశాంతి ప్రాథమిక పాఠశాలలో రూ.30 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదాన్ని అందించేలా రూ.20 లక్షలతో ఆంధ్రరత్న పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని చెప్పారు. వందేళ్ల ఘన చరిత్ర కలిగిన శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి ఈ ప్రభుత్వంలోనే రూ.70 లక్షల సీజీఎఫ్ నిధులు విడుదల చేశామన్నారు. ఆర్యవైశ్యుల దశాబ్దాల కల అయిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని నిర్మించామని చెప్పారు. అదే విధంగా డివిజన్‌లో అక్షరాల రూ.21.31 కోట్లతో వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేశామన్నారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావులను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దోనేపూడి శ్రీనివాస్, ఒగ్గు విక్కీ, పసుపులేటి ఏసు, శనగవరపు శ్రీనివాస్, అఫ్రోజ్, మేడా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

28వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం



ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని 28వ డివిజన్‌లో శుక్రవారం ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. రైల్వే కాలనీ పరిసర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి జగనన్న హయాంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే 28వ డివిజన్‌లో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రతి ఒక్కరికీ అన్ని సంక్షేమ పథకాలు అందాయన్నారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ కనపర్తి కొండా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సామాన్యులకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, నాయకులు

పాయకాపురం(విజయవాడరూరల్): సామాన్యులకు అండగా ఉండే పార్టీ వైఎస్సార్ సీపీ అని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. ప్రతిపక్షంలోనే టీడీపీ దాడులు చేస్తోందని, అధికారంలోకి వస్తే సామాన్య ప్రజలకు రక్షణ ఉండదని, టీడీపీకి ఓట్లు వేయవద్దని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మేమంతా సిద్ధం బస్సు యాత్ర నిర్వహిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావులపై టీడీపీ వర్గీయులు రాళ్ల దాడి చేశారని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం 62వ డివిజన్ పాకిస్తాన్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావులను గెలిపించాలని ఎమ్మెల్సీ రుహుల్లా కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే 62వ డివిజన్‌లో అభివృద్ధి పనులు జరిగాయని,వె వెలంపల్లి శ్రీనివాసరావును గెలిపిస్తే డివిజన్ మరింత అభివృద్ధి చేస్తారన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని శ్రీనివాస్, వెలంపల్లి శ్రీనివాసరావులను గెలిపించాలని వెలంపల్లి శ్రీనివాసరావు సోదరుడు రామకృష్ణ కోరారు. ప్రచారంలో పార్టీ నాయకులు అలంపూరు విజయ్‌కుమార్, డివిజన్ ఇన్‌చార్జి మస్తాన్, రామిరెడ్డి, సుబ్బారెడ్డి, బోర బుజ్జి, మస్తాన్,రమేష్, హైమావతి, సావిత్రి, పలువురు కన్వీనర్లు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన



ఆటోనగర్(విజయవాడతూర్పు): శ్రీరామనవమి సందర్భంగా స్థానిక 15వ డివిజన్ లోని వీఎంఆర్ రోడ్డులో శుక్రవారం అన్నసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు సీత, రామ, లక్ష్మణ, ఆంజనేయస్వామికి పలువురు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వీఎంఆర్ రోడ్డు శ్రీరామ భక్త బృందం ఆధ్వర్యంలో మరో మూడు రోజుల పాటు శ్రీరామ నవమి వేడుకలను నిర్వహిస్తామని కమిటీ పెద్దలు చెప్పారు.

కనులవిందుగా కూచిపూడి నృత్యాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ శ్రీ కోదండ రామాలయం శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం శ్రీ నృత్య కళా నిలయం నాట్యాచారిణి గోనిగుంట శ్రీశైలశ్రీ శిష్యబృందం చేసిన కూచిపూడి నృత్యాలు ఆహూతులను అలరించాయి.చిన్నారులు తరంగం, అన్నమాచార్య కీర్తనలకు అనుగుణంగా చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు కూచిపూడి నృత్యాలను భక్తిశ్రద్ధలతో వీక్షించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.వీ రాజు, గంగిశెట్టి సాంబశివరావు, గౌరవాధ్యక్షుడు మాదినేని కృష్ణారావు పర్యవేక్షించారు.

నేడు రథోత్సవం

శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం 4 గంటలకు రథోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. రథోత్సవంలో భక్తులు పాల్గొని సీతారాముల కృపకు పాత్రులు కావాలని కోరారు.

ముగిసిన భారతీ తీర్థ జన్మదిన వేడుకలు



వేద సభను నిర్వహిస్తున్న పండితులు

విజయవాడకల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి జన్మదిన వేడుకల సందర్భంగా దుర్గాపురంలోని శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఉదయం జరిగిన కార్యక్రమంలో మహాన్యాసపూర్వక ఏకాద రుద్రాభిషేకం, బిల్వార్చన, శ్రీ చక్రనవావరణార్చన, శాంతిహోమం, మృత్యుంజయ హోమం నిర్వహించారు. సాయంత్రం ఆది దంపతుల త్రిశతి నిర్వహించారు. క్షేత్ర ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ వేదపండితులను ఘనంగా సత్కరించారు. హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విధుశేఖర భారతి ఆదేశాలతో కార్యక్రమం నిర్వహించామన్నారు. వేద సంరక్షణకు, ధర్మరక్షణకు శృంగేరీ పీఠం నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు.

పిల్లలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తాం



భవానీపురం(విజయవాడపశ్చిమ): అవసరమైన పిల్లలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య తెలిపారు. విద్యాధరపురం కబేళా రోడ్‌లోని ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహం(జువెనైల్ హోమ్)ను ఆయన శుక్రవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. పిల్లలతో సంభాషించి వారికి హోమ్‌లో కల్పించే సౌకర్యాలు, సమస్యలు, వారికి కల్పించే లీగల్ సర్వీసెస్(న్యాయ సలహాలు) గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా పిల్లలకు వివిధ చట్టాలపై క్లుప్తంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. బాల్యంలో తెలిసో తెలియకో చేసిన తప్పుల పట్ల పశ్చాత్తాపపడి పరివర్తన చెందాలని అన్నారు. తద్వారా సమాజంలో ఉత్తమ పౌరులుగా తయారవ్వాలని సూచించారు. కార్యక్రమంలో హోమ్ పర్యవేక్షణాధికారి పి.రామమోహన్‌రెడ్డి, బాలల న్యాయ సలహా మండలి సభ్యులు అన్నామణి, ప్యానల్ లాయర్ మహాలక్ష్మి, ప్రొహిబేషన్ ఆఫీసర్ హసన్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయడాన్ని అదృష్టంగా భావించాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవికిషోర్ తదితరులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తోటి వారికి సేవ, సహాయం చేసే అవకాశం రావడం అదృష్టంగా భావించాలని ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) విజయవాడ బ్రాంచ్ చైర్మన్ నిట్టా రవికిషోర్ అన్నారు. ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ ఆధ్వర్యంలో గవర్నరుపేటలోని ఐసీఏఐ భవన్ ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నిట్టా రవి కిషోర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అసోసియేషన్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రయాణికుల దాహార్తిని తీర్చడం కోసం ప్రతి ఏటా వేసవి కాలంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తుంటామని చెప్పారు. మంచినీటితో పాటుగా మజ్జిగను కూడా పంపిణీ చేస్తామన్నారు. ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ కార్యదర్శి జయంత్ ఉప్పులూరి, విజయవాడ బ్రాంచ్ మాజీ చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

కిక్ బాక్సర్ పవన్‌కుమార్‌కు సత్కారం



పవన్‌కుమార్‌ను సత్కరిస్తున్న బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ బంగార్రాజు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు క్రీడలను ప్రోత్సహించటంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందు వరుసలో ఉంటుందని జోనల్ మేనేజర్ ఎంవీవీ బంగార్రాజు తెలిపారు. చుట్టుగుంట బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ కార్యాలయంలో శుక్రవారం ప్రముఖ కిక్ బాక్సర్ ప్రత్తి పవన్‌కుమార్ అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువ కిక్ బాక్సర్ పవన్‌కుమార్ 3వ ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో బంగారు, కాంస్య పతకాలు సాధించటం అభినందనీయమన్నారు. యువ క్రీడాకారులు పవన్‌కుమార్‌ను ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడాకారుడు పవన్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ టోర్నీలో తనకు రెండు మెడల్స్ రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా అందించిన ఆర్థిక సహకారం మరువలేనిదని కొనియాడారు. క్రీడలకు బ్యాంకు ప్రాముఖ్యత ఇవ్వటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. డెప్యూటీ జోనల్ మేనేజర్ జి.వి.సూర్యకిరణ్, బ్యాంక్ సిబ్బంది పవన్‌కుమార్‌ను అభినందించారు. అనంతరం పవన్‌కుమార్‌ను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు.

ముస్లింలంతా కూటమి అభ్యర్థులను ఓడించాలి



నియమాక పత్రాలు అందజేస్తున్న ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా

పాయకాపురం(విజయవాడరూరల్): ముస్లిం మైనార్టీలందరూ ఏకమై కూటమి అభ్యర్థులను ఓడించాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా పిలుపునిచ్చారు. శుక్రవారం కండ్రికలో మస్జిద్ ఏ హబీబుర్రహ్మాన్ దగ్గర ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ ఆలీ ఆధ్వర్యంలో ముస్లిం యువకుల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్‌మీరా మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారానికి ఏఎంసీ కృషి చేస్తోందన్నారు. కమిటీలో యువత భాగస్వామ్యం అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. అందరూ ఏకమై సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఓడించాలన్నారు. ముస్లింల అభివృద్ధికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ మద్దతుగా ఉండాలని కోరారు. వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని శ్రీనివాస్, వెలంపల్లి శ్రీనివాసరావులను గెలిపించాలని కోరారు. కమిటీ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన వివరించారు. 64వ డివిజన యూత్ అధ్యక్షుడిగా అబ్దుల్ నజీర్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ చాన్ బాషలను నియమించి వారికి నియామక పత్రాలు అందజేశారు. సమావేశంలో కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోజామణికి డాక్టరేట్



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రా లయోలా కళాశాలలో లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ పీజీ అధ్యాపకురాలు తాడితూరి రోజామణికి డాక్టరేట్ లభించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీఏపీ కిషోర్ తెలిపారు. ప్రొటోటైపింగ్ అండ్ అనలైజింగ్ ద ఇంపాక్ట్ ఆఫ్ ఐసీటీ ఆన్ ఇన్ఫర్మేషన్ సీకింగ్ బిహేవియర్ ఆఫ్ లైబ్రరీ యూజర్స్ ఇన్ అటానమస్ ఇంజినీరింగ్ కాలేజెస్ అండ్ జేఎన్‌టీయూ కాకినాడ అనే అంశంపై రోజామణి పరిశోధన చేశారన్నారు. పలు అంతర్జాతీయ జర్నల్స్‌లో నాలుగు పరిశోధన పత్రాలను ప్రచురించారని చెప్పారు. ఆమె కృషి ఫలితంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా ఆమెకు ప్రిన్సిపాల్‌తో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

వడదెబ్బ తగలకుండా హోమియో మందుల పంపిణీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు వడదెబ్బ తగలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు సూచించారు. కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు వడదెబ్బ తగలకుండా హోమియో మందుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో వడగాడ్పులు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఎండలో ఎక్కువగా తిరగరాదన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు కల్మాబేగం, డి.పవన్‌కుమార్, ఎస్.సాంబశివరావు, జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.